

గోవిందరాజు శ్రీనివాసమూర్తి

మయూరుకు ఒక చిన్న సందేహం వేసింది.

"నేను డిటెక్టివ్‌ని కదా—హంతకుణ్ని అరా తియ్యటమే నా వృత్తి కదా—అటువంటిది ఇంత జరుగుతున్నా నాకు తగినపని లేకా—చిన్న దాని వలపునకు గురికావడం ఆరోగ్యకరమేనా," అనుకున్నాడు.

"అయినా మన కది మంచిదికాదు. డిటెక్టివ్ లకూ ప్రేమకూ చాలదూరం ఉన్నది. పనిలేనివాడు ఏదో చేసినట్టు నాకు ఇదే మిటి...పనిలేకపోతే బుర్ర పాము మెలికలు తిరుగుతుంది. త్వరగా ఏదో పని నెత్తిన పెట్టుకోవాలి—ఏంపనీ?"

తనవృత్తి వినా తనకేం కనబళ్ళేదు. ఒక్క నిమేషకాలం బుర్ర అల్లకల్లోలం అయింది డిటెక్టివ్ మయూరుకు.

"హత్యలు చేసేవారు అదృశ్యమైపోయారు," అనుకున్నాడు. వెంటనే చిరునవ్వు పెదవుల మీదకు తిరుముకుని వచ్చింది.

"కాకపోతే, మూడునెలలుగా ఒక్క హత్యకూడ తను వినకపోవడం శోచనీయంగా ఉంది. మయూరుకు ఇవాళో రేపో, ఎల్లుండో ఇక్కడో ఎక్కడో ఏదోఒక హత్య జరిగితీరాలి, అలాకాని పక్షంలో తనకు ఉపద్రవం కలుగవచ్చు. అంటే తను చిన్న దానివలలో పడిపోవచ్చు. అంతటితో తనవృత్తికి స్వస్తి కలగవచ్చు—

డిటెక్టివ్ మయూరుకు భయం వేసింది. సిగరెట్ చప్పగా ఉందేమో విసిరి పారేశాడు. వళ్లు భగున మండుతున్నది.

"ఏమిటిది ఏమయింది తనకు" ఇదే ఆలోచన మయూరుది.

తలు పెవరో తట్టారు. మయూరు ఇంటి తలుపు పరాయివారు తట్టి చాలకాలం అయింది. ఆత్రుతతో వరుగెత్తి తలుపు తీశాడు. వర్షంకోసం తపనపడే కర్షకుడి మీద మేఘుడు కరుణించి నట్టయింది—ఎదురుగా ఇన్‌స్పెక్టర్ పాషా నిలబడి ఉన్నాడు. పాషా తనకోసం వచ్చి చాలా నెలలయింది.

విపరీతానందంతో వళ్లు గగుర్పొడిచి వెంటనే చల్లారింది మయూరుకు.

చిరునవ్వు నవ్వాడు.

పాషా, నవ్వలేదు. ముఖంలో ఆందోళన వ్యక్తపరుస్తున్నాడు. లోపలకు ప్రవేశించాడు. ఆందోళన తగ్గలేదు.

"ఏమయింది?"

మయూరు ఆత్రుత ఎక్కువయింది.

ఏమయింది? పాషా మాట్లాడడేం—పాషా ఏదో హత్యనుగురించి తనతో చెప్పడేం. తనకు పని తగలాలి—చిన్న దాని వలలోనుంచి తప్పుకోవాలి. కాని పాషా మాట్లాడడేం.

కాని పాషా మాట్లాడాడు.

"మైలాపూర్‌లో అనంతనాయక్ స్ట్రీట్‌లో ఒక ఇంట్లో ఒకావిడ కుర్చీలో కూలబడిపోయింది." అన్నాడు.

"హత్యా, ఆత్మహత్యా?" అనడిగాడు మయూరు.

సిగరెట్ వెలిగించాడు. ఈమాటు సిగరెట్ కమ్మగా ఉంది.

పాషా తల పైకెత్తాడు.

"ఆత్మహత్య" అన్నాడు.

కాలు జారి నట్లయింది మయూరుకు. అపురూపమయిన పాషా తనకు దర్శనమిచ్చి ఒక ఆత్మహత్య కేసునుగురించి తనకు చెప్పబోవడంఏమీ బాగాలేదు మయూరుకు.

"ఆత్మహత్యే—కుర్చీలో కూర్చుని ఉన్నది వనిత. చేతిలో పిస్టలు ఉన్నది. నుదుటిమీద రక్తంకారి ఎండిపోయింది. కనుక ఆత్మహత్య చేసుకుని ఐదారు గంటలై ఉండవచ్చు. పిస్టలును నుదుటిమీద పేల్చుకుంది."

"పేల్చుకుందని నీకెలా తెలుసు?" అన్నాడు మయూరు.

"అంతకన్నా మరొకటి జరిగేందుకు వీలులే"దన్నాడు పాషా.

"ఆధారాలేవీ లేవా?" అన్నాడు మయూరు.

"తెల్లకాగితంమీద రాసినట్టు తెలుస్తున్నది—ఆత్మహత్యేనని. ఇక ఆధారాలతో నిమిత్తంలేదు, ఒకవేళ ఉన్నా అది మీపని."

మయూరుకు ఆసక్తి హెచ్చయింది.

"అది ఆత్మహత్య కాకపోతే..."

* * *

అనంతనాయక్ స్ట్రీట్‌లో ఉన్న ఇంటికేసి బయలుదేరారిద్దరూ.

మెట్లెక్కి మేడమీది కెళ్లారు. మేడమీద ఒకటేగది. కొత్తగా సున్నం వేయించినట్టు ఉన్నది. హాండిల్ తిప్పి తలుపుతీశాడు. హాండిల్ పరిశీలించాడు మయూరు. బయట నుంచి కూడ తాళంచెవితో తీయవచ్చు ఆ తలుపు. పాషా ముందు ప్రవేశించాడు గదిలోకి. మయూరు ప్రవేశించడంతోటే భయంకరదృశ్యం కనబడిందతడికి. ఎదురుకుర్చీలో ఓ స్త్రీ కూచునిఉన్నది. కళ్లు మూతబడి ఉన్నవి. తల ప్రేలాడుతున్నది. నుదుటిమీద నుంచి వచ్చిన రక్తంకన్నులమీద నుంచి ముక్కుమీదకు పెదవులమీదకు ప్రవహించి ఎండిచారలు కట్టింది. చేతులు బిగుసుకున్నవి కాబోలు—చేతిలోని పిసలు అట్లాగే ఉన్నది. మయూరు భరించలేకపోయాడు.

"ఈమె ఇంత ఘోరానికి ఎందుకు ఒడిగట్టాలి?" ఇదే సమస్య పదేపదే ప్రశ్నిస్తున్నది మయూరును.

పాషా మాట్లాడలేదు. ఓ మూల నిలబడి ఉన్నాడు.

"ఇలా ఎందుకు చేసింది" అనడిగాడు మయూరు.

"ఆత్మహత్యేనని విపులంగా తెలుస్తున్నది" అన్న పాషా మాటలను మయూరు వినిపించుకున్నట్టులేదు. గది అంతా పరిశీలిస్తున్నాడు—జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. తనకొక్కవలసింది ఏ మూలాలేదు. అసలు తనకు ఏం కావాలో తనకే తెలియదు. అందుకే పరిశీలిస్తున్నాడు. గబుక్కున ఒక్క అనుమానం వేసింది మయూరుకు.

"ఈమె ఎవరు?"

ఈమె ఎవరో తన కింతవరకు తెలియదు. అలాంటిది తను ఆ గదిని పరీక్షించడంలో అర్థంలేదు. ముందు ఈమె ఎవరో తెలుసుకోవాలి. కథను కొంత వెనక్కులాగాలి. పాషా కేసి తిరిగాడు.

"ఈమె ఎవరు?" అన్నాడు.

ఇంతసేపూ మయూరు కేసి వింతగా చూస్తున్న పాషా ఉలిక్కిపడ్డాడు—ఒక్కమాటు మయూరు కళ్లకేసి చూడలేదు పాషా.



కొంత భయంకలిగిస్తయ్ ఆ కళ్లు.

"నిస్సందేహంగా స్త్రీయే" అన్నాడు పాషా. తను వేసిన జోక్‌కి తనకే నవ్వొచ్చింది. పెద్దగా నవ్వాడు.

కాని తనవంకే తదేకదీక్షతో చూస్తూన్న మయూరు కళ్ళు తన నవ్వును అంతర్ధానం చేసినై.

"ఈమె ఎవరు?" అన్నాడు మయూరు గట్టిగా, ఈ మాటు మయూరు కళ్ళలో మునుపటి చిలిపితనం లేదు. పరిశీలనా దృష్టిలోనే ఉన్నయ్ ఇంకా అతడికళ్ళు.

—తక్కున మయూరు ఒళ్ళు చల్లబడిపోయింది — నోటిమాట రావటం లేదు.

నిశ్శబ్దంగా ఉన్నది గది అంతా. పాషా నిశ్శబ్దాన్ని చీల్చాడు.

"పాపం ఆత్మహత్య చేసుకున్నది." జాలితో నిండిపోయింది అతడి హృదయం. మయూరు పాషాకేసి తిరిగాడు. కాని మాట్లాడలేదు. పాషా కెందుకో భయం వేసింది. గబగబ మాట్లాడాడు.

"ఈమె అప్పుడప్పుడు డ్రామాలు వేస్తుంది. సినిమాల్లోకూడా చిన్న చిన్న వేషాలు వేస్తుంది—ఆత్మహత్య చేసుకున్నది. అందుకు ఆధారం ఆమెచెయ్యి. పిస్టలును స్వయంగా నుదుటిమీద పేల్చుకున్నది. పిస్తోలును పేల్చుకున్నప్పుడు వెనక్కువచ్చే తెల్లటి మసి ఆమెచేతిన ఉన్నది. నేనిందాక పరీక్షించాను. కనుక..."

తను చెప్పవలసిందేమిటో గబగబ చెప్పేశాడు పాషా.


కాని మయూరు వినిపించుకున్నట్టులేదు.

"ఆమూల గోడలో తెల్లగ నిగనిగమెరిసే పదార్థం ఏమిటో చూడు," అని మాత్రం అనగలిగాడు.

చెప్పడమే మయూరు వంతుగాని చెప్పిం తర్వాత దాని అంతుతేల్చడం పాషావంతు- నిగనిగ మెరిసే పదార్థం అంతు తేల్చాడు— అది బుల్లెట్. బుల్లెట్ గోడలో ఎందుకు ఉన్నదో అతడికి అర్థంకాలేదు. మయూరుకు అంతకన్న అర్థంకాలేదు.

గదిఅంతా వెతుకుతున్నాడు డిటెక్టివ్ మయూరు. పురుషు లెవ్వరూ నివసిస్తున్నట్టు లేదు అగదిలో — చిన్న గది — సన్నటి మంచం – ఓ మూలసాంతు నిండా చీరలూ, జాకెట్లూ — కిటికీలో ఓమూల ఇస్త్రీపెట్టె, దానిపక్కనే ఎత్తైనచక్కపెట్టె, పెట్టెమీద ఉతికి మడిచిపెట్టిన లంగాలూ, బాడీలూ, మరోపక్క నిలువుటద్దం, అద్దంముందు చిన్న రౌండు టేబిలు, దానిమీద పౌడరు, లిప్‌స్టిక్ మొదలైన సామానులు...మరోమూల లేసు అల్లిన టేబిల్ క్లాత్ ఆరేసిఉన్నది. స్త్రీనివాస యోగ్యంగా తప్పితే మరోలా లేదుగది. పురుషులెవ్వరూ ఉన్నట్లుఎంతమాత్రం లేదు. గోడకిమధ్యగా పెద్దడ్రాయరు ఉన్నది.

డ్రాయరులాగాడు మయూరు. అందులో కొన్ని ఇస్త్రీచీరెలు ఉన్నయ్. ఇంకా కొంచెం లాగాడు డ్రాయర్ని— స్తంభించిపోయాడు—చేతులు వణుకుతున్నట్టు ఉన్నయ్. గీరలగుడ్డ ఒకటి బయటకులాగాడు. [illegible]



"ఏటికెదురు"

—చిత్రకారుడు: శీలా వీర్రాజు.

# ★ రెండంకాల హత్య ★

విప్పాడు. అది పురుషులు రాత్రి పూట తొడుక్కునే గీరల పైజామా. అటువంటివే ఇంకా రెండున్నయ్—వేర్వేరు రంగులలో. పైజామాలను పరీక్షించాడు. చాకలి మార్కు మూడింటి మీదా ఒక్కటే "A. J" అని ఉన్నది.

"పాషా" అని పెద్దగా కేకేశాడు మయూరు. దగ్గరలోనే ఉన్న పాషాకు మయూర్ ఇంత పెద్ద కేక ఎందుకు వేశాడా అన్న సందేహం వేసింది.

"ఈమెను గురించి నీకేమైనా తెలుసా" అనడిగిన మయూరు ప్రశ్నకు, "కొంత తెలుసు. కాని ఈ ఇంటి యజమానికి ఎక్కువ తెలిసుండవచ్చు" అన్నాడు పాషా.

మయూరు ఇక ఆగలేదు.

గబుక్కున తలుపు తీశాడు. తలుపు దగ్గరే చెవిపెట్టి వింటున్న ఇంటియజమాని ఉలిక్కిపడ్డాడు. "ఊరికే...ఊరికే..." అని తడబడుతున్నాడు.

మయూరు యజమాని భుజం మీద చేయి వేశాడు.

"మీ పేరు?"

"భు....భుగంజ....భుజంగరావు" అన్నాడు వణుకుతూ.

"భుజంగరావు గారూ, మీతో కొంత మాట్లాడాలి" అన్నాడు మయూరు.

భుజంగరావు పలకలేదు.

"ఈ చనిపోయిన స్త్రీ—ఈమె పేరేమిటన్నారూ?"

"మీనాకుమారి, మీనా అంటారు అందరూ. ఈ రోజే ఎవరో వచ్చారల్లే ఉన్నది. రాత్రి ఎనిమిది తొమ్మిది గంటలప్పుడు తలుపు తట్టిన చప్పుడయింది నాకు నా గదిలోకి వినబడింది తలుపు చప్పుడు" అన్నాడు భుజంగరావు.

"పాషా" అని మళ్లీ కేకేశాడు మయూరు. దగ్గర్లోనే ఉన్న పాషాకు ఈ కేకల అంతరార్థం బోధపడ్లేదు.

"మీరు పెద్దగా అరుస్తున్నారు. నేను మీకు అంటుకునే ఉన్నాను" అన్నాడు.

మయూరు సన్నగా నవ్వాడు.

"పాషా, భుజంగరావుగారు నీతో మాట్లాడాలిట. నాకు సెలవు ఇప్పించు," అన్నాడు.

పాషాకు సంగతి అర్థం అయింది. తను మీనాకుమారి విషయం భుజంగరావుద్వారా ఆరాతీసి అంతు తేల్చాలి.

మర్రోజు పాషా వద్దనుంచి ఏ వర్తమానం లేదు. శవాన్ని మాత్రం హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లారు శవ పరీక్షకు. ముళ్ళమీద ఉన్నట్టు ఉన్నది మయూరుకు.

"ఏమౌతుంది? హత్యా? ఆత్మహత్యా" ఇదే ఆలోచన అతడిది.

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటితలుపు చప్పుడయింది. ఆతృతతో పరుగెత్తాడు మయూరు.

తలుపవతల పాషా నిలబడి ఉన్నాడు.

"వెయ్యేళ్ళు. లోపలకురా," అన్నాడు మయూరు.

"లోపల కొచ్చేందుకు టైము లేదు. మీరు అర్జంటుగా నాతో రావాలి. వివరాలు వెడుతూ చెబుతాను." అన్నాడు పాషా, మరీ అర్జంటుగా.

మయూరు ఆలస్యం చేయలేదు. రెండో నిముషంలో తయారయినాడు.

కారువచ్చి పోలీస్ స్టేషన్ ముందు ఆగింది. ఇద్దరూ దిగి లోపలకు నడిచారు.

లోపల ప్రవేశించగానే ముగ్గురువ్యక్తులు కనుపించారు. పాషా ముగ్గురు వ్యక్తుల్నీ మయూరుకు పరిచయం చేశాడు.

"ఈయన లాయరు. పేరు జోగారావు. వారిపేరు సత్యానందంగారు. ఈ కుర్రవాడి పేరు మోహనరావు.

మయూరు మాటాడలేదు. మరో గదిలోకి ప్రవేశించాడు. జోగారావుగారికి కబురంపాడు.

జోగారావు బిక్కు బిక్కుమంటూ గదిలోకి వచ్చాడు.

"మీ ఇంటిపేరు." అన్నాడు మయూరు గబుక్కున.

"అన్నెకంటి" అన్నాడు జోగారావు.

"మీకు ఎంతకాలం నుంచి మీనాకుమారితో పరిచయం ఉన్నది?"

ఈ ప్రశ్నకు త్రుళ్ళిపడ్డాడు జోగారావు.

మీరడుగుతున్నది నాకు బోధపడటంలేదు. అయినా అది నా వ్యక్తిగత విషయం. ఇంతకీ, మీరు నన్నెందుకు పిలిపించారో సెలవిస్తారా?" అన్నాడు. కొంత కోపం కనుపిస్తున్నది అతడి కళ్లలో.

"మీనాకుమారి నిన్నరాత్రి ఆత్మహత్య చేసుకున్నది." అన్నాడు మయూరు.

జోగారావు చలించాడు. భయం కనబడుతున్నది ముఖంలో. మాట్లాడలేదు జోగారావు.

"నిన్న రాత్రి ఆమె ఇంటికి మీరు ఎన్ని గంటలకు వెళ్ళారు?

"ఎనిమిది గంటలకు" అన్నాడు జోగారావు.

"తేలిపోయింది," అన్నాడు మయూరు జోగారావుకేసి తిరగకుండా.

జోగారావుకి మండిపోయింది.

"మీరు తేల్చింది— నేను మీనాకుమారిని హత్యచేశానంటారు—అంతేగా—కాని ఆధారం ఏమిటి?"

"మీ పైజామాలు" అన్నాడు మయూరు వెంటనే, "వాటిమీద "ఎ. జె." అన్న మార్కు వున్నది అన్నికంటె జోగారావన్నమాట."

జోగారావుకి చెమటలు పోసున్నై. కర్చీఫ్‌తో తుడుచుకుంటున్నాడు.

"నాకేమీ అర్థం కావటంలేదు అనవసరంగా నిందమోపడం మీకు భావ్యంకాదు. కోరుకు లాగుతాను మిమ్మల్ని."

మయూర్ నవ్వాడు. "ఇకమీరు వెళ్ళవచ్చు" అన్నాడు.

* * *

సత్యానందం లోపల ప్రవేశించాడు.

"మీరడగబోతున్నది నాకు తెలుసు. మీనాకుమారి విషయం—అంతేనా? ఆమె నాకు ఎంతవరకు తెలుసో నేనే చెబుతాను నాతో చిన్న బిజినెస్ ఉన్నది. దానో ఆమెకు నాలుగు షేర్లు ఉన్నవి నాలుగువేల రూపాయలు. అప్పుడప్పుడు బిజినెస్ గురించి మాట్లాడుకోటం మాకు పరిపాటి నిన్న రాత్రి ఆమె ఇంటికి నేను వెళ్ళలేదు. ఆమెను నేను చూసి వారం రోజులయింది. అంతకన్నా నాకు తెలియదు. ఇహ నేను వెళ్ళవచ్చా?" అన్నాడు సత్యానందం.

"వెళ్ళవచ్చు" అన్నాడు మయూరు.

సత్యానందం హత్యలుచేసే ఆసామీలా కనిపించలేదు మయూరుకు. చిలిపికళ్ళు—పెదవులమీద చిరునవ్వు సత్యానందం ప్రత్యేకత నలభైఏళ్ళపైబడ్డా గూడా.

* * *

మోహనరావు ప్రవేశించాడు గదిలోకి. మయూరు అతడికేసి దీక్షగా చూశాడు. అమ్మాయిలు మామూలుగా ఒకమాటుగాక మరోమాటు తిరిగి చూసే అందం మోహనరావుది. పాతికేళ్ళ పొడుగాటి విగ్రహం. కాని అంత విగ్రహం వణుకుతున్నది.

"మీనాకుమారి మీకెలా తెలుసు." అన్నమయూరు ప్రశ్నకు ప్రాణం లేచిపోయింది మోహనరావుకి.

"తె... తెలీదు... తెలుసు. ఆమె నాకు తెలుసు. జోగారావుగారు మా మేనమామ. ఆయనద్వారా తెలుసు."

"మీరు ఉండేది ఎక్కడ?" అన్నాడు మయూర్.

"మా మేనమామ ఇంట్లోనే."

"మీరేం చేస్తున్నారు?"

కాస్త సద్దుకున్నాడు మోహనరావు.

"నేను అసలు ఢిల్లీలో పుట్టాను. మా తల్లిదండ్రులు ఢిల్లీలోనే ఉన్నారు. నేను మద్రాసు వచ్చి సరిగా ఆరురోజులయింది. అంతకుముందెప్పుడూ రాలేదు. మా మేనమామద్వారా మీనాకుమారి పరిచయం అయింది. ఆరురోజులక్రితం నేను మద్రాసు చూడలేదు. మీనాకుమారిని అంతకన్నా చూడలేదు. మూడు రోజుల్లో నాకు మద్రాసంతా ఆమె చూపించింది. లైట్‌హౌస్ ఎక్కాం. నిన్న రాత్రి రెండో ఆటకు సినిమాకు వెడదాం అన్నది ఎనిమిదిన్నరకు ఆమె ఇంటికి వెళ్లాను. వంట్లో బాగాలేదనీ ఇవాళ సినిమాకు వెడదామనీ అన్నది. ఇవాళ ఈ దారుణవార్త విన్నాను. అంతకన్నా నాకేమీ తెలియదు," అన్నాడు. మోహనరావు.

తను చెప్పదలుచుకున్నదేమిటో చెప్పాడు మోహనరావు. కాని ఇంకా భయంగానే ఉన్నాడు.

"వంట్లో బాగాలేదని చెప్పింది అన్నారు కదా, కారణం ఏమన్నా చెప్పిందా," అన్నాడు మయూరు.

"తల నొప్పి అన్నది," అన్నాడు మోహనరావు

* * *

ముగురు వ్యక్తులూ వెళ్ళిన తర్వాత పాపా మెల్లిగా లోపలకు ప్రవేశించాడు. సిగిరెట్ వెలిగిస్తున్న మయూర్‌ని చూస్తూ "ఏమంటారు?" అన్నాడు.

"అనేందుకేమున్నది. ఇది హత్య."

"ఒకవేళ హత్య అయితే హంతకుడు జోగారావు."

"ఎలా చెప్పగలవు?"

"చాల తేలిక విషయం. ఈ ముగ్గురిలో ఒక్క జోగారావుగారికే ఆమెతో సంబంధం ఉన్నదని రుజువయింది. పైగా అతడొక్కడే తరచు ఆమె ఇంటికి వెడతాడు. పైజామాలు ఆమె ఇంట్లో ఉన్నవి," అన్నాడు పాపా.

మయూరు నవ్వాడు.

"సరే, ఇంకొంత పరిశీలించవలసిన అవసరం ఉన్నది. రేపు మరికొంత గ్రంథం నడుపుదాం. నువ్వు మాత్రం ఈ ముగురిమీద కన్నేసి ఉంచాలి." అన్నాడు మయూర్.

ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు.

పాపావద్ద నుంచి శెలవుతీసుకున్న మయూరుకు పరిపరివిధాల పోతున్నది మనస్సు. ఆఖరుకు ఒక నిర్ణయానికి వచ్చాడు. నేరుగా జోగారావు గారింటికి దోవతీశాడు.

* * *

మర్రోజు రాత్రి పదిగంటలకు పాపా ఆయాసపడుతూ మయూర్ ఇంటితలుపు తట్టాడు. తలుపు తీయబడిన తర్వాత లోన ప్రవేశించినా అతడి ఆయాసం తగ్గలేదు.

"మీరు అర్జంటుగా రావాలి. కొంప మునిగింది—అనుకోకుండా పర్వతం పగిలింది. జోగారావుగారు ఆత్మహత్య చేసుకున్నారు." అన్నాడు పాపా మరీ ఆయాసపడుతూ.

మయూరు అదిరి పడ్డాడు. వళ్లు విరుచుకుని పోయింది.

ఒక్కక్షణం తర్వాత ఇద్దరూ బయలు దేరారు.

జోగారావుగారిల్లు నిశ్శబ్దంగా ఉన్నది. మోహనరావు తలుపుతీశాడు అతడి కళ్లంట నీళ్లు కారుతున్నై. "ఏమయింది?." అన్నాడు మయూరు. జవాబు కోసం ఎదురు చూడకుండా జోగారావుగారి గదిలోకి ప్రవేశించాడు.

తను చూసిన దృశ్యం మయూరును స్తంభింపచేసింది. కుర్చీలో కూచునిఉన్నాడు జోగారావు. మెడ వేళ్లాడుతున్నది. నుదుటి నుంచి కారిన రక్తం ముక్కు పెదవుల నుంచి తెల్లటి చొక్కామీదకు ప్రవహించి భయంకరరూపం దాల్చింది. చేతిలో పిస్తలు ఉన్నది. గబుక్కున ముందుకు పరిగెత్తి పిస్తలు ఉన్న చేతినిపరిశీలించాడు మయూరు. చేతినిండా తెల్లటిమసి ఉన్నది. సాక్షాత్తూ మీనాకుమారి చనిపోయిన సన్నివేశంలాగే ఉన్నది జోగారావు పరిస్థితి.

మయూరు ఇహ ఆగలేదు. గబగబ గది అంతా దీక్షగా పరిశీలించాడు. తను అనుకున్నట్లుగానే ద్వారబంధంలో ఓ మూల ఏదో పదార్థం తెల్లగా మెరుస్తున్నది. బయటకు లాగాడు అది ఒక బులెట్.

"నేను చాల ఆలస్యంచేశాను. లేకుంటే ఈ హత్య తప్పించగలిగే వాణ్ణి" అంటున్న మయూరుకేసి విస్మయాశ్చర్యాలతో చూస్తున్నాడు పాపా. అతడికేం బోధపడలేదు.

(34-వ పేజీ చూడండి)

మా వద్ద
కిర్లొస్కార్ ఇండియా మాన్
ఇంజన్లు, మోటారు పంపు
సెట్లు, చెఱకు గానుగలు
దొఱకును.
రేడియో అండ్ ఎలక్ట్రికల్సు.
విజయనగరం.
ఫోను :111 గ్రాం : RADELECT

# ★ రెండంకాల హత్య ★

(15-వ పేజీ తరువాయి)

"జోగారావుగారు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు? పైగా మీనాకుమారి చనిపోయిన వైనంగానే ఉన్నది ఈయన మరణం;" పాషా అంటున్నాడు.

మయూరు ఆలోచిస్తున్నాడు. మాట్లాడలేదు.

పాషా చెప్పుకుపోతున్నాడు. "జోగారావుగారు మీనాకుమారిని అతిగా ప్రేమించి ఉంటారు. ఆమె మరణవార్త దుర్భరంగా ఉండి ఉండాలి ఆయనకు. ఆవిడ లేకుండా జీవితం గడపటం ఎలాగో ఆయనకు తోచిఉండదు. అదీ కాక ఒకవేళ మీనాకుమారిది హత్య అని నిరూపింపబడితే ఈయనమీదే ఎక్కువ అనుమానం వేసేందుకు తగినన్ని ఆధారాలు ఉన్నవి. ఇక భరింపలేక ఆత్మహత్య చేసుకున్నాడు పాపం!" అన్నాడు పాషా.

మళ్లీ అతడి హృదయం జాలితో నిండిపోయింది.

కాని మయూరు మాట్లాడలేదు. ఉండి ఉండి అతడి ముఖంలో ఆందోళన వ్యక్తమయింది. కనుబొమలు ముడుచుకున్నై. పాషాకేసి తిరిగాడు.

"ముందుగా సత్యానందాన్ని అరెస్టు చెయ్." అన్నాడు.

పాషా నివ్వెరపోయాడు. మయూరు మామూలు ధోరణిలో లేడేమో ననిపించింది.

"సత్యానందాన్నా? ఎందుకు?"

"ముందువెళ్ళి అరెస్టు చేయ్. తర్వాత కారణాలు చెబుతాను."

"కారణం ఏమని చెప్పను."

"కారణానికేముంది? మీనాకుమారినీ, జోగారావుని హత్యచేసిన కారణానికి," అన్నాడు మయూరు.

పాషాకు ఒళ్ళంతా గగుర్పొడుస్తున్నది. వెంటనే బయలుదేరాడు.

* * *

మర్రోజు ప్రొద్దుట మయూర్ ను కలుసుకున్నాడు పాషా, సత్యానందాన్ని అరెస్టు చేశాడన్న మాటే కాని అతడికి సందేహంగానే ఉన్నది. "ఇది హత్యేనా? హత్య అయితే సత్యానందం దోషి ఎట్లా అవుతాడు?"

ఈ సంగతే మయూరును అడిగాడు.

మయూరు చెప్పుకుపోయాడు.

"నేనూ మొదట్లో మీనాకుమారి ఆత్మహత్య చేసుకున్నది అనుకున్నాను. ఆ రోజే ఇద్దరం వెళ్ళి ఆమెఉన్న పరిస్థితిచూశాము. ఆత్మహత్య చేసుకున్నది అనుకునేందుకు అనుకూలంగా ఉన్నది అక్కడి వాతావరణం. కాని మరొక్కమారు అంతా పరీక్షించాను. గోడలో బులెట్ కనబడింది మనకు. "అదేమిటని" అడిగావు. అప్పటికి నాకే బోధపడలేదు. తర్వాత డ్రాయర్లో పైజామాలు కనబడినవి. దాంతోటి పురుషులు ఇక్కడకు వచ్చే అలవాటుందని వ్యక్తమవుతుంది. ఇహ హత్య విషయం—ముందు హంతకుడు ఆమెను పిస్టలుతో నుదుటిమీద పేల్చి హత్య చేశాడు. ఆమె పూరిగా ప్రాణం విడువకమునుపే ఆమె చేతిలో ఆ పిస్టలు పెట్టి రెండవసారి ఊరికే గోడకేసి గురిచూసి పేల్చాడు. అందుకే గోడలో బులెట్ ఉన్నది. ఆమె చేతికి మసిఅయిన కారణం అది. కనుక హత్య అని తేలిపోయింది.

ఇహ హంతకు డెవరు? బాగా ఆలోచించాను పైజామాలు గదిలో ఉన్నందువల జోగారావే హంతకుడు కావచ్చు అని ఊహించాను. ముగ్గుర్ని మనం ఆరోజు పోలీస్ స్టేషన్ లో కలుసుకున్న తర్వాత నేను ఒక్కొక్కర్ని విడిగా కలుసుకున్నాను జోగారావు హంతకుడయ్యేందుకు వీలు లేదని ఆరోజే తెలిసిపోయింది. ఎందుకంటే అతడికి మీనాకుమారితో చాలకాలంగా పరిచయం ఉన్నది. ఆమెహత్య చేయబడ్డరోజు రాత్రి ఎనిమిది తొమ్మిదిగంటల మధ్య ఆమె ఇంటికి ఎవరో వచ్చి తలుపుతట్టారని భుజంగరావు చెప్పాడు. తలుపుతట్టేఅవసరం జోగారావుకి లేదు. ఎందుకంటే ఆతలుపు బయటనుంచి కూడా తీయవచ్చు. నేవారోజే పరిశీలించాను. బయటనుంచి తీసేతాళం చెవి జోగారావు వద్ద ఉన్నది. కనుక ఆయన తలుపుతట్టడు. బయటనుంచే తాళంతీసి లోపలకు పోవడం అలవాటు అతడికి - కనుక అతడు హంతకుడు కాదు.

"తర్వాత మోహనరావు—అతడు ఎంత మాత్రం హత్యచేయలేదు. అతడు మద్రాసు వచ్చి వారంరోజులయింది. అంతకు ముందెప్పుడూ మద్రాసు రాలేదనేందుకు నిదర్శనాలు దొరికినై. హత్య అతడు చేయలేదు. ఎందుకంటే వారంరోజుల్లో ఒకస్త్రీ మీద అంత ప్రేమపుట్టి దానిద్వారా ఈర్ష్య జనించి హత్య చేయగలిగేంత తీవ్రతకు రావడం అసంభవం. కనుక అతణ్ణి వదిలేశాను!

ఇంత దాకా చెప్పిన మయూరు ఆపి సిగిరెట్ వెలిగించాడు.

"మరి సత్యానందం హత్య చేశాడనటానికి నిదర్శనం ఏమున్నది?" అన్నాడు పాషా.

మయూరు అందుకున్నాడు.

"అదే చెప్పబోతున్నాను. అతనేదో బిజినెస్ చేస్తున్నాడని మీనాకుమారికి అందులో షేర్లు ఉన్నవనికదూ అన్నాడు. మీనాకుమారికి ఆబిజినెస్ లో షేర్లు ఉన్నమాట నిజమే. ఆరోజు ఆమెగదిలో డ్రాయర్లో షేర్ సర్టిఫికేట్లు చూశాను. కాని సత్యానందం ఆడబ్బంతా సంవత్సరం క్రితమే ఖర్చు చేశాడు. అతడివద్ద ప్రస్తుతం చిల్లిగవ్వకూడ లేదు. అతడిబ్యాంకిఎకౌంటు నిన్న చూశాను. సంవత్సరం క్రితమే శూన్యమయింది అకౌంటు. మీనాకుమారి డబ్బు విషయమై సత్యానందాన్ని పదే పదే అడుగుతూండి ఉండాలి. అతను ఇదుగో అదుగో అంటూ వచ్చాడు కాని మీనాకుమారి ఇక భరించలేకపోయింది. డబ్బు ఇవ్వకపోతే కేసు పెడతానని బెదిరించింది. తోచకలేదు సత్యానందం. అతడి బుర్రలో మరోరకమైన ఆలోచనలు మొలకెత్తినై ఆరోజుతో అవి బలపడినై. రాత్రి తొమ్మిది గంటలప్పుడు నేరుగా మీనాకుమారి ఇంటికి దారితీశాడు. తలుపుతట్టాడు ఆమెతలుపుతీసింది నవ్వుతూ లోపల ప్రవేశించాడు-ఆమె అలా జరుగుతుందని ఊహించి ఉండదు—పిస్టలుతో ఆమె నుదుటిమీద పేల్చేశాడుసత్యానందం. తర్వాత పిస్టలును ఆమె చేతిలో పెట్టి గోడకు గురిచూసి పేల్చాడు. ఆమె చేతికి మసిఎక్కించడమే అతడి ప్రధానోద్దేశం ఆత్మహత్య చేసుకుందని అనుకోడానికి అనుకూలంగా చేశాడు వాతావరణాన్ని. అంతటితో అతడి పని అయిపోయింది. ఇహ డబ్బు విషయమై తనను బాధించలేదు మీనాకుమారి. అది సత్యానందం అభిప్రాయం." అన్నాడు మయూరు.

కొంత గర్వంగా కనుపిస్తున్నది అతడి ముఖం.

"మరి జోగారావు ఎందుకు హత్య చేయబడ్డాడు?" అన్నాడు పాషా. ఇది ఎంతసేపు ఆలోచించినా తెగని సమస్య అయింది అతడికి.

మయూరు మెత్తగా నవ్వాడు.

"తేలిక ప్రశ్న. పైజామాల మూలంగా జోగారావు మీద బలమైన నిదర్శనం ఒకటున్నది. అతడే హంతకుడని తేలిపోయింది. ఇక జోగారావుభరించలేదు. తనను జైలులో వేసారు—ఈబాధతో అతడుఆత్మహత్య చేసుకున్నాడు" అన్నాడుమయూరునవ్వుతూ

"మరి హత్య అంటిరికదా." అన్నాడు పాషా.

"అదే జోగారావు ఆత్మహత్య చేసుకున్నాడని నువ్వూ నేనూ, మిగతా ప్రపంచం అనుకోవాలని సత్యానందం ఊహ. హంతకుడే ఆత్మహత్య చేసుకుంటే మనం హంతకుణ్ణి ఏం చెయ్యగలం. ఇదే సత్యానందానికి వచ్చిన చురుకైన ఊహ.

చిలిపిగా నవ్వాడు మయూరు.

పాషా ఇకమాట్లాడలేదు. అతడు మెల్లిగా నవ్వి తర్వాత పెద్దగానవ్వి

"శెలవు" అన్నాడు.

మయూరు మాట్లాడలేదు. వలచిన చిన్నదానిపైకి మళ్ళీ ఆలోచనలు పోయినై. ★